

ఉమ్మెడ - పంచగుడిల మధ్యఉన్న బ్రిడ్జి నిర్మాణంలో జరిగిన సాంకేతిక లోపాన్ని మ్యాప్ ద్వారా వివరిస్తున్న రిటైర్డ్ డీఎస్పీ

ఎస్సారెస్పీ వరద, ముంపు బాధితులకు పరిహారం చెల్లించాలి

- బ్రిడ్జి నిర్మాణ లోపంతోనే పెరుగుతున్న ముంపు
- సాంకేతిక లోపంతోనే నీట మునిగిన 80వేల ఎకరాలు
- దీనిపై విచారణ జరిపించాలి: రిటైర్డ్ డీఎస్పీ మనోహర్

నవీపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ వరదతో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని న్యాయవాది, రిటైర్డ్ డీఎస్పీ మనోహర్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వరద ముంపు బాధిత రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నందిపేట మండలం ఉమ్మెడ, నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పంచగుడిల మధ్య ఇటీవల నిర్మించిన రోడ్డు బ్రిడ్జి సాంకేతిక లోపంతోనే ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌తో సుమారు 80వేల ఎకరాలలో పంటలు నీట మునిగాయని ఆయన వివరించారు. బ్రిడ్జి సాంకేతిక నిర్మాణ లోపంపై హైకోర్టు మాజీ న్యాయమూర్తితో గానీ, రిటైర్డ్ టెక్నికల్ అధికారితో గాని విచారణ జరిపించాలని కోరారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు 42 గేట్లు ఉండగా వరద సమయంలో కేవలం 39 గేట్లు మాత్రమే తెరవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మిగిలిన గేట్లు ఎందుకు తెరవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఉమ్మెడ, పంచగుడి బ్రిడ్జి నిర్మాణ సాంకేతిక లోపంపై బోధన్, ఆర్మూర్, ముథోల్ ఎమ్మెల్యేలు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో ఉన్న నల్లమట్టిని తరలించేందుకు రైతులకు అనుమతి ఇవ్వాలని ప్రాజెక్ట్ లోపల ఉన్న చెట్లు, ముళ్ల పొదలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గోదావరి వరదలతో నష్టపోయిన పలువురు రైతులు తమ ఆవేదనను సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో నవీపేట, రెంజల్, బోధన్, సాలూర, పోతంగల్, బాసర మండలాలకు చెందిన పలువురు బాధిత రైతులు పాల్గొన్నారు.

10న జిల్లాకు సీఎం రాక ?



నిజామాబాద్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈనెల 10న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు రానున్నట్లు జిల్లా కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇటీవల నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తల్లి లక్ష్మీ నర్సమ్మ మృతిచెందగా.. ఆమె దశ దినకర్మ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం జిల్లా కేంద్రానికి రానున్నట్లు తెలుస్తోంది. నగర శివారులోని భూమారెడ్డి కన్వెన్షన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సీఎంతోపాటు జిల్లాకు చెందిన ముఖ్యనేతలు హాజరుకానున్నట్లు సమాచారం. ఇంకా సీఎం పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఖరారు కావాల్సి ఉండడంతో పర్యటనపై అధికారికంగా ప్రకటన జారీ కాలేదు.



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

గెలుపు గుర్రాలకే టికెట్లు


- కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలి
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉన్నవారికి.. గెలుపు గుర్రాలకే ఎంపీటీసీ, జడ్పీటీసీ టిక్కెట్లు వస్తాయని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్ మండలంతో పాటు సాలూర మండలంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. సాలూర, బోధన్ మండలాల్లోని ఎంపీటీసీ, జడ్పీటీసీల అభ్యర్థుల ఎంపిక కోసం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, ముఖ్యంగా రైతుబంధు, రైతు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యంలాంటి పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ సూచించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. బోధన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కష్టపడే నాయకులు, కార్యకర్తలకే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ టిక్కెట్లు ఇస్తుందన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

బోధన్ నియోజకవర్గంలోని అన్నిగ్రామాల్లో నిలిచే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, పట్టణ అధ్యక్షుడు పాషామొయినోద్దీన్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అల్లెసాయన్న, అల్లెజనార్ధన్, గణపతిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, శంకర్ సార్‌లతో నాగేశ్వర్ రావు, మందర్నా రవి, విఠల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, పోతారెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

ప్రధాన పార్టీలకు అభ్యర్థుల కొరత



- అభ్యర్థుల కోసం నేతల అన్వేషణ
- రిజర్వేషన్లతో దొరకని బలమైన నాయకులు
- తలలు పట్టుకుంటున్న పార్టీల నేతలు
- అగ్ని పరీక్షగా ఎంపిక
- కోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వచ్చి వారం కావస్తున్నా ఇంకా ప్రధాన పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయలేదు. ప్రధాన పార్టీలలో అనేకచోట్ల రిజర్వేషన్లు తేలినా బరిలో నిలిపేందుకు బలమైన అభ్యర్థులు లేక ఆయా పార్టీల నేతలు తలలు పట్టుకుంటున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఆదివారం సాయంత్రం నాటికి ప్రతీ మండలం నుంచి ముగ్గురు ఆశావహుల పేర్లు ఇవ్వాలని పీసీసీకి ఆదేశాలిచ్చింది. కానీ ఎక్కడా బలమైన అభ్యర్థులు లేకపోవడంతో జాబితా తయారు కాలేదు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలోనూ అదే పరిస్థితి నెలకొంది.

నిజామాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ప్రధాన పార్టీలన్నీ బలమైన అభ్యర్థుల కోసం వెతుకుతున్నాయి. అయితే చాలా ప్రాంతాల్లో అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొంది. జడ్పీటీసీ స్థానాలకైతే కొన్ని మండలాలలో రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థులే దొరకని పరిస్థితి నెలకొంది. అన్నిపార్టీలు ముగ్గురు నలుగురు ఆశావహుల పేర్లతో సర్వేలు చేసి టికెట్లు ఖరారు చేద్దామనే ఆలోచన చేస్తున్నప్పటికీ ఆ మండలాలలో ఒకరు లేదా ఇద్దరే ఆశావహులు ఉండడంతో తప్పని పరిస్థితుల్లో ఎవరో ఒకరిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎలాగైనా మెజార్టీ స్థానాలు గెలిచి జిల్లా పరిషత్‌ను కైవసం చేసుకోవాలని ఆలోచనలో ఉన్న అధికార కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారింది. బలమైన అభ్యర్థులు లేకపోతే ఓటమి తప్పదని ఉన్న వారిలోనే బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉండడంతో ఆయా పార్టీల నేతలు తలలు పట్టుకుంటున్నారు.

అంతటా ఇదే పరిస్థితి

జిల్లాలో 31 జడ్పీటీసీ స్థానాలు, 307 ఎంపీటీసీ స్థానాల్లో ప్రధాన పార్టీలకు అభ్యర్థుల విషయంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. పార్టీకి సేవలు అందించిన సీనియర్లు ఉన్న మండలాలలో రిజర్వేషన్లు వారికి అనుకూలంగా రాకపోవడంతో వారంతా పోటీకి దూరమవుతున్నారు దీంతో ఆయా మండలాలలో అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొంది. జనరల్ మహిళ, బీసీ మహిళ బీసీ ,జనరల్, రిజర్వేషన్‌లు వచ్చిన చోట అభ్యర్థుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకపోగా ఎస్సీ మహిళ, ఎస్సీ జనరల్, ఎస్టీ మహిళ, ఎస్టీ జనరల్ వచ్చిన మండలాలలో మాత్రం అన్ని పార్టీలకు బలమైన అభ్యర్థులు దొరికే పరిస్థితి లేదు. కనీసం ఆ మండలాలలో పార్టీ కోసం పనిచేసిన నాయకులు కూడా లేని పరిస్థితి ఉండడంతో అభ్యర్థుల ఎంపికకు పార్టీ నేతలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. సర్వేల (మిగతా 6వ పేజీలో)

కోర్టు తీర్పు కోసం ఎదురుచూపులు

2019 ఎన్నికల్లో 27 జడ్పీటీసీ స్థానాలు ఉంటే బీసీలకు 6 సీట్లు కేటాయించగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 42శాతం రిజర్వేషన్ల జీవోతో ఈసారి బీసీల సీట్లు 13కు పెరిగాయి. ఎంపీటీసీ స్థానాల్లో కూడా బీసీ సీట్లు గణనీయంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవో 9ని కొట్టివేయాలని సుప్రీంకోర్టుతోపాటు హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ విచారణకు రానుండగా 8న హైకోర్టులో విచారణ జరగనుంది. కోర్టు తీర్పు ఏవిధంగా వస్తుందోనని అన్ని రాజకీయ పార్టీల నేతలు ఎదురుచూస్తున్నారు. ఒకవేళ కోర్టు తీర్పు అనుకూలంగా వస్తే ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లు యదావిధిగా అమలుకానున్నాయి. ఒకవేళ తీర్పు ప్రతికూలంగా వస్తే రిజర్వేషన్లు మళ్లీ ప్రకటించే అవకాశాలు ఉండడంతో ఆశావహులంతా కోర్టు తీర్పు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.



టెన్షన్..టెన్షన్!

- ఊగిసలాటలో ఆశావహులు, నేతలు
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు
- ఎక్కడ చూసినా ఎన్నికల ముచ్చట్లే

5

మొక్కజొన్న కొనకుంటే తిరుగుబాటే

- గిట్టుబాటు ధర ఇవ్వని ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి



సుభాష్‌నగర్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మొక్క జొన్న పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ప్రభుత్వంపై ఆర్మూర్ గడ్డ నుంచే తిరుగుబాటు ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పంటకు గిట్టుబాటు ధర ఇవ్వని ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సేనని పేర్కొన్నారు. జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లు లేక రోడ్ల వెంబడి పంటను పోసిన రైతుల బాధలు వర్ణనాతీతమని తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఇప్పటికీ నష్ట పరిహారం ఇవ్వని కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వంపై తిరుగుబాటు చేయక తప్పదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే ధోరణితో వ్యవహరిస్తే ఎర్రజొన్న రైతుల తరహా ఉద్యమం చేయడం ఖాయమని, జిల్లా రైతులతో కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలని చెప్పి ఒక్క గ్యారెంటీ సక్రమంగా అమలు చేయని రేవంత్ సర్కారుకు గుణపాఠం చెప్పడానికి రోజులు దగ్గరలోనే ఉన్నాయని జీవన్‌రెడ్డి ఈ సందర్భంగా విమర్శించారు.



ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

- పలుచోట్ల కార్యక్రమాలు
- హాజరైన ప్రముఖులు

6



ప్రాజెక్టు నుండి విడుదలవుతున్న నీరు

ఎస్సారెస్పీకి లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- 26 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి లక్షా 10వేల క్యూసెక్కుల వరద వస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. దీంతో ప్రాజెక్టు 26 వరద గేట్ల ద్వారా లక్ష క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 4వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, లక్ష్మీకాలువ ద్వారా 200 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 1090 అడుగుల 80టీఎంసీలు ఉందని అధికారులు తెలిపారు.

ప్రాజెక్టుపై పర్యాటకుల సందడి

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవురోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ప్రాజెక్టు నిండు కుండల నిండి వరద గేట్లను ఎత్తడంతో పర్యాటకులు తమ ఫోన్‌లలో ప్రాజెక్టు అందాలని బంధించారు. ప్రాజెక్టుదిగువనున్న నెహ్రూ పార్కులో పర్యాటకులు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. పర్యాటకులకు ఇబ్బందులు కలగకుండా ఎస్సై సుహాసిని బందోబస్తు చేపట్టారు.



ప్రాజెక్టు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

కమ్మర్‌పల్లి పీఎస్‌ను తనిఖీ చేసిన సీపీ



రికార్డులను తనిఖీ చేస్తున్న సీపీ సాయిచైతన్య

కమ్మర్‌పల్లి, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో వివిధ రకాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తు పూర్తి చేసేందుకు ప్రత్యేక యాక్షన్‌ప్లాన్ ఉండాలని, ప్రతీ కేసులోని ప్రతీ అంశాన్ని పరిశీలించాలని ఎస్సైలకు సూచించారు. స్థానిక ఎన్నికలు సజావుగా జరగడానికి అన్నివిధాల ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్‌స్టేషన్‌లు, పోలింగ్ లోకేషన్‌లపై పూర్తిఅవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్‌ను తప్పనిసరిగా సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకోవాలని, కేంద్రాలలో ఉండాల్సిన కనీస వసతుల సమాచారం అందించాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో సైబర్‌నేరాలు జరుగుతున్నాయని, సైబర్ నేరాల పట్ల పాఠశాలలు, కళాశాలల్లో, సోషల్‌మీడియా (మిగతా 6వ పేజీలో)

ఇసుకాసురుల నయా దందా

- రూటు మార్చిన ఇసుక మాఫియా
- కలిసొచ్చిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- ట్రాలీ ఆటోలలో ఇసుక తరలింపు
- జోరుగా అక్రమ వ్యాపారం
- అధికారుల కనుసన్నల్లో దందా!

ఎడపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పుష్టిగా కురవడంతో ఇదే అదునుగా ఇసుక బకాసురులు తమ వ్యాపారానికి కొత్త రూటు వెతుక్కున్నారు. ఈ అక్రమ ఇసుక రవాణా వ్యాపారం గతంలో కంటే ఈసారి భిన్నంగా సాగుతోంది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులలో ముందే భారీగా చేసుకున్న డంపుల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరందుకుంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఇతర కట్టడాలు జోరుగా కొనసాగుతుండడంతో ఇసుక కొరత కృత్రిమంగా సృష్టించి ఉన్న ధర కంటే రెండింతల ధర పెంచి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో సామాన్య గృహ నిర్మాణదారులకు ఇసుక రూపంలో గట్టి దెబ్బ తగలక తప్పడం లేదు. వారి జేబులకి చిల్లు పడేలా అధిక మొత్తం వెచ్చించి తప్పని పరిస్థితులలో ఇసుకను కొనాల్సి వస్తోంది.



ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఇసుక లోడుతో ఉన్న ఆటోలు (ఫైల్)

మినీ ఆటోలతో వ్యాపారం

గతంలో ఇసుక రవాణా టారస్, టిప్పర్, ట్రాక్టర్‌లలో ఈ వ్యాపారం జరిగేది. ఇందులో భాగంగా డంపింగ్ యార్డుల నుంచి అక్రమంగా ఇసుకను వీటితో తరలిస్తే పట్టుబడతాయనే ఇసుక వ్యాపారులు కొత్త రూటు ఎంచుకున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నుంచి అక్రమంగా డంపింగ్ చేసిన ఇసుకను వందలాది మినీ ట్రాలీ ఆటోలలో రూట్లు మార్చుతూ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మినీ ట్రాలీ ఆటోలో కూరగాయలు, (మిగతా 6వ పేజీలో)



అన్నదాతకు వరి 'గోస'

- భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- వరదలతో ఇప్పటికీ పొలాల్లో ఇసుక మేటలు
- ధాన్యం పొట్ట దశలో వేధిస్తున్న తెగుళ్ల బెడద
- నివారణ మందుల పిచికారీతో అదనపు భారం

ప్రకృతి విపత్తు.. సర్కారు నిర్లక్ష్యం రైతును నిండా ముంచేస్తున్నాయి. నారు పోసిన నాటి నుంచి పంట కోసే వరకు రైతుకు గోసలు తప్పడం లేదు. ఖరీఫ్ ప్రారంభంలో నాట్లు వేసిన పొలాలకు వర్షాల్లేక నీరు అందడం లేదని బెంగ పడిన రైతులకు కోత దశకు వస్తున్న తరుణంలో కురిసిన భారీ వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేశాయి. చేతికి అందిన పంటలను కాపాడుకుందామని అనుకున్న రైతులకు మాయదారి మోగి పురుగు ద్వారా వచ్చే తెగుళ్లు రైతులను నష్టాల్లోకి నెట్టేస్తున్నాయి.

● భీమ్‌గల్, ఆంధ్రజ్యోతి

భీమ్‌గల్ మండలంలో 32వేల 580 ఎకరాలలో రైతులు వరి సాగు చేశారు. ఇందులో కొంతమంది రైతులు జూన్ ప్రారంభం నుంచే వరి సాగు ప్రారంభించారు. మరికొంతమంది వర్షాలు సమృద్ధిగా కురిసిన అనంతరం పంటలను వేశారు. ఈ ఖరీఫ్ ప్రారంభంలో అనుకున్న స్థాయిలో వర్షాలు కురియడంతో ముందుగా వేసిన రైతులు పంటలకు నీరు అందలేదు. అయినా ఆశలు వదలక వట్టిపోతున్న బోర్లు, అద్దె నీటి ట్యాంకర్లతో సాగు చేస్తూ పంటలను కాపాడుకున్నారు. ఆ వెంటనే భారీ వర్షాలతో రైతుల పంట పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో పంటలను తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరి సాగుకు అవసరమయ్యే సరిపడా యూరియా కొరతతో రైతులు రాత్రి వేళల్లో సొసైటీల వద్ద నిరీక్షించారు. ప్రభుత్వాలు అనుకున్నంత యూరియా సరఫరా చేస్తున్నామని (మిగతా 6వ పేజీలో)



రైతుల పొలాల్లో ఇసుక మేటలు

క్రైం సమాచారం

వివాహిత ఆత్మహత్య


భాగ్యలక్ష్మి (ఫైల్)

లింగంపేట, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐలాపూర్‌కు చెందిన కొట్టంల భాగ్యలక్ష్మి(20) ఆదివారం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. భాగ్యలక్ష్మి కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతుందని, దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసిట్లు ఎస్సై తెలియజేశారు. మృతురాలికి ఏడాదిన్నర కూతురు భవ్యశ్రీ ఉన్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

భిక్కనూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): : మండలంలోని జంగంపల్లి శివారులో ఆర్‌టీఏ చెక్ పాయింట్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై అంజనేయులు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కామారెడ్డి వైపు నుంచి జంగంపల్లికి బైక్‌పై వెళ్తున్న మనోహర్, నిశాంత్‌తో పాటు లక్ష్మీనగర్‌తాండా వద్ద సీతాఫలాలు విక్రయిస్తున్న బానోత్ శంక్(55)ను అదేవైపు వెళ్తున్న కారు అతివేగంతో ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా.. నిశాంత్, మనోహర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు గాయపడిన వారిని వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో బీజేపీ నేత మృతి


శ్రీనివాస్(ఫైల్)

రామారెడ్డి, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పల్వాయికి చెందిన బీజేపీ నేత కాల శ్రీనివాస్ గుండెపోటుతో మృతిచెందారు బీజేపీలో పార్టీలో మండల, జిల్లాస్థాయి నాయకత్వంలో మంచిగా పనిచేశారు. శ్రీనివాస్ మృతికి తీరని లోటని మాజీ మండలాధ్యక్షుడు భూమాగౌడ్ విచారం వ్యక్తం చేశారు. కాల శ్రీనివాస్ అంత్యక్రియల్లో కామారెడ్డి జిల్లా బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేపలవేటకు వెళ్లి యువకుడి గల్లంతు

మెండోర, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ముందు చేపలు పట్టడానికి వెళ్లి అనిల్ నీటిలో గల్లంతయ్యాడని ఎస్సై సుహాసిని తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. శనివారం దిలాల్‌పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన ఆనంద్, అనిల్ సోదరులు చేపలు పట్టడానికి ప్రాజెక్టు వరద గేట్ల ముందుకు వెళ్లారు. గేట్ల ద్వారా నీటి ప్రవాహం పెరగడంతో ఆనంద్ ప్రాణాలతో బయటపడ్డాడు. అనిల్ నీటిలో గల్లంతయ్యాడు. అతడి కోసం గోదావరిలో గాలించినా ఆచూకీ దొరకడలేదని, గల్లంతయిన వ్యక్తి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి అదృశ్యం

బోధన్,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాకాసిపేటలో గల వృద్ధాశ్రమం నుంచి శెట్‌పల్లి లత అనే వృద్ధురాలు శనివారం సాయంత్రం అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. నవీపేట మండలం అభంగపట్నం గ్రామానికి చెందిన వృద్ధురాలు లత మతిస్థిమితం లేక బోధన్‌లో తిరుగడంతో పోలీసులు సదరం హోమ్‌లో ఆశ్రయం కల్పించారని తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి ఆమె కనిపించకపోవడంతో సదరం నిర్వాహకులు పోలీసులకు తెలుపగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు. సీసీ ఫుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ జరిపి అదృశ్యమైన వృద్ధురాలిని పట్టుకుంటామని సీఐ తెలిపారు.

అడుగడుగునా గుంతలు


గాంధీనగర్ - నాగాపూర్ మార్గంలో ఏర్పడిన గుంతలు


కమ్మర్‌పల్లి మండలంలో ఇలా..


రోడ్డుప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు(ఫైల్)

కమ్మర్‌పల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, జగిత్యాల జిల్లాల సరిహద్దులోని కమ్మర్‌పల్లి 63వ నంబరు జాతీయ రహదారిపై అడుగడుగున అడుగులోతు గుంతలు ఏర్పడి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణాలు సాగించే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో అప్పటి రోడ్డుభవనాల శాఖమంత్రివేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రీబీటింగ్ పనులు చేయించారు. అయితే ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చిన్నచిన్న గుంతలు కాస్త అడుగులోతుగా మారాయి. మోర్తాడ్ మండల సరిహద్దు నుంచి కమ్మర్‌పల్లి మీదుగా జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం సరిహద్దు గండి హనుమాన్ వరకు కేవలం 4 కిలోమీటర్ల పొడువు జాతీయ రహదారి 63 పరిధిలోకి వస్తుంది. ఈ పరిధిలో వందల సంఖ్యలో గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు గుంతలను తప్పించబోయి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టడం లేదా.. అదుపు తప్పి ప్రమాదాలకు లోనవ్వడం పరిపాటిగా మారింది. 4రోజుల క్రితం గుంతలను తప్పించబోయి ఎదురుగా వస్తున్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తి తీవ్రగాయలతో బయటపడగా కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

ఎడపల్లిలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఎడపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ షిర్డీసాయి బాబా అలయ 15వ వార్షికోత్సవాలు 3రోజులపాటు ఘనంగా నిర్వహించారు. వేడుకలలో చివరి రోజైన ఆదివారం ఆలయంలో భక్తులు ఉదయం నుంచి సాయి నామస్మరణ, సాయి సచ్చరిత పారాయణం చేస్తూ భజనలు చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ప్రతీఒక్కరు భక్తిభావన కలిగి ఉండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామంలో సాయిబాబా ఆలయాన్ని స్థాపించి ప్రతి గురువారం భక్తులకు అన్నదానం చేస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వర శర్మను ఆయన అభినందించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సాయిబాబా చిత్రపటాన్ని గ్రామ పురవీధుల గుండా భక్తులు ఆటపాటలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వరశర్మ, కంజర్ సవిత, కంజర్ రామకృష్ణ, శ్రీలత, భక్తులు ఉన్నారు.


వేడుకల్లో పాల్గొన్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాల ప్రారంభం


కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ ప్రత్యేక అధికారి అశోక్

రెంజల్,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ప్రత్యేక అధికారి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం రెంజల్ ప్రాథమిక సహకార సంఘంతో పాటు నీలా, సాటాపూర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఇంద్రసేన్, సిబ్బంది కిషోర్, శ్రీనివాస్, సాయిబాబా పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు


మోతేలో ఎల్లమ్మకు బోనాలు తీస్తున్న భక్తులు

వేల్పూర్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతెలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా ఆదివారం ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ ఉత్సవాలలో భాగంగా సోమవారం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య అమ్మవారికి ప్రాణప్రతిష్ఠ, శాంతికళ్యాణం, మహాపూర్ణహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గౌడ సంఘ సభ్యులు తెలిపారు. ఈనెల 7 వరకు గ్రామంలోని బ్యాంక్ వద్ద ఎల్లమ్మ ఒగ్గు కథ ఉంటుందన్నారు. ప్రతీరోజు బైండ్ల పోతరాజుల ఆటపాటల విన్యాసాలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు.

సిద్దులగుట్టపై మాస్క్, స్కార్ఫ్ నిషేధం



మాస్క్‌లు, స్కార్ఫ్‌లు ధరించి రాకూడదని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పెర్కిట్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని పవిత్ర పుణ్యక్షేత్రం నవనాథ సిద్దుల గుట్టపైకి యువతీ, యువకులు మాస్క్, స్కార్ఫ్ ధరించి వెళ్లడాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు నిషేధించారు. ఇటీవల గుట్టపైకి వెళ్లే దారిలో ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. సిద్దుల గుట్టపైకి కొంతమంది యువతీయువకులు మాస్క్‌లు, స్కార్ఫ్‌లు ధరించి వెళ్లి అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారని, వాటికి అడ్డుకట్ట వేయడానికి మాస్క్‌గాని, స్కార్ఫ్‌గాని ధరించి వస్తే ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమని పేర్కొన్నారు. ఎవరైనా గుట్టపైకి వచ్చి మళ్లీ మాస్క్‌లు గాని, స్కార్ఫ్‌లు గాని ధరిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. ఆర్మూర్ పట్టణ, పరిసర గ్రామాల నుంచి దూర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు గుట్టపైకి వచ్చి సిద్దేశ్వరున్ని దర్శనం చేసుకుంటారు. ఇలాంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో ఏవిధమైన అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ఏర్పాటు చేసిన నిబంధనలను భక్తులందరూ పాటించాలని సూచించారు.

మొక్కజొన్నలకు మద్దతు ధర ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రైతు నాయకుడు జైడి గంగారెడ్డి

జక్రాన్‌పల్లి, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటుచేయాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జక్రాన్‌పల్లిలో రైతు నాయకుడు జైడి గంగారెడ్డి రైతులతో కలిసి మాట్లాడారు. మొక్కజొన్న పంట చేతుకు వచ్చి కల్లాలలో, రోడ్ల పక్కన ఆరబెడుతున్నప్పటికి కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న పంట దెబ్బతిందని దీంతో రైతులు పంట నష్టపోయారన్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు అమ్మి తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని రైతులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతులు నరెడ్ల చిన్నసాయిరెడ్డి, నికిల్‌రెడ్డి, జైడి చిన్నోళ్ల గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో స్వచ్ఛ భారత్


శ్రమదానం చేస్తున్న మహాత్మా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఆర్మూర్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫైర్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్ ఆవరణలో, వెనకభాగంలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్, గణేష్, రాజ్‌కుమార్, ప్రశాంత్, నిశాంత్, మ ధుసూదన్, నరేందర్,ఎల్లయ్య, ఆదిత్య, కృషివర్ధన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి


బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గంగారెడ్డి

బోధన్,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గిర్దావర్ గంగారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆచన్‌పల్లి శివారులో బీఆర్ఎస్ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను నాయకులు, కార్యకర్తలు అషామాషిగా తీసుకోవద్దని, కష్టపడి పని చేస్తేనే లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పని చేసి ధైర్యంగా ముందుకెళ్లి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కాంగ్రెస్‌ని గెలిపించి తప్పు చేశామని బాధ పడుతున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి కార్యకర్తలు సిద్దంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ధర్మయ్యగారి సంజీవ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, నాయకులు రవి కిరణ్, నర్సయ్య, ఖలీల్, పీరయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలను కైవసం చేసుకుందాం



బీజేపీలో చేరుతున్న సాలూర వాసులు

బోధన్,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ కన్వీనర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సాలూరకు చెందిన లింబూరి లక్ష్మణ్‌తో పాటు యువకులు అధిక సంఖ్యలో పార్టీలో చేరగా వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు ఆసక్తిగా ఉన్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను కార్యకర్తలు సమష్టి కృషితో గెలిపించాలన్నారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు పర్చడంలో విఫలమైందన్నారు. ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. బీజేపీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో బీజేపీ కార్యకర్తలు పోటీలో ఉంటారన్నారు. అన్ని స్థానాలు కైవసం చేసుకునేలా పక్కా ప్రణాళికతో కార్యకర్తలు ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు రావుబా గంగాధర్, ప్రధాన కార్యదర్శి దిలీప్, సుభాష్, సీనియర్ నాయకులు గోనె ప్రవీణ్, ముత్యం ప్రకాష్, మాధవరావు పటేల్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కాలనీలో కష్టాలు


భారీ గుంతలు పడి గుంతలలో నీరు నిలిచిన దృశ్యం

జక్రాన్‌పల్లి,అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లిలోని జాతీయ రహదారి బ్రిడ్జి నుంచి ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలకు వెళ్లే వైఎస్ఆర్ కాలనీలో సమస్యల నిలయంగా మారింది. కాలనీలో ఏర్పడి ఏళ్లు గడుస్తున్నప్పటికీ సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీ నుంచి ఆదర్శ, కసూర్బా గాంధీ పాఠశాలకు చదువుకోవడానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి విద్యార్థులు వెళ్తారు. భారీ వర్షాలకు కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై భారీ గుంతలు పడి నీరు నిలిచిపోయింది. ప్రతీరోజు పాఠశాలల వైపు విద్యార్థులు ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై వెళ్తుంటారు. దీంతో ఈ దారిలో నరకయాతన అనుభవిస్తున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని, పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని ఇటీవల కాలనీవాసులు ఎంపీడీవో సతీష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారులకు వినతిపత్రం అందజేసి నెల గడుస్తున్నా కాలనీలో సమస్యలను పరిష్కరించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తమ అవస్థలు తీర్చాలని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


సాలురలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ సీఈవో శివరామకృష్ణ

సాలూర,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాడిజమాల్‌పూర్ పీఏసీఎస్ సీఈవో డీ.శివరామకృష్ణ అన్నారు. ఆదివారం సాలూర మండలంలోని జాడి సొసైటీ ఆవరణలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం రైతులకు మంచి గిట్టుబాటు ధరను అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన రైతులకు సూచించారు. చివరి గింజ వరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ ధాన్యాన్ని రైతులు విక్రయించాలని విజ్ఞప్తి చేశారు. సిబ్బందికి సహకరిస్తూ ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తెచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బోధన్: మండలంలోని ఎరాజ్‌పల్లి, మినార్‌పల్లి, అమ్దాపూర్, ఊట్‌పల్లి సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ సీఈవోలు కోరారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

నవీపేట,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘుపతిరెడ్డి గార్డెన్స్‌లో సోమవారం మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షులు భగవాన్‌లు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హాజరుకానున్నారని వారు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి సకాలంలో హాజరై, విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి


బినోలలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవీపేట,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11, 12వ తేదీలలో జిల్లా కేంద్రంలో జరిగే తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బీఎల్‌టీయూ) 2వ రాష్ట్ర మహసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు ఎస్. సిద్ది రాములు కోరారు. ఆదివారం మండలంలోని బినోలలో రాష్ట్ర మహసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బీడీ కార్మికులకు నెలకు 4016రూపాయల జీవన భృతిని చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గంగాధర్, కిషన్, కళావతి, మమత, వర్షిత, నవనీత పాల్గొన్నారు.

డీపీవో ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం


కోస్లీలో వినోద్‌ను సన్మానిస్తున్న యువకులు

నవీపేట,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీలో ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాలలో డీపీవో ఉద్యోగం సాధించిన వినోద్‌ను ఆదివారం స్థానికులు ఘనంగా సన్మానించారు. రెంజల్‌లో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వినోద్ ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాలలో ఉత్తీర్ణత సాధించి డీపీవో ఉద్యోగం సాధించారు. ఈ మేరకు వినోద్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. వినోద్ లాంటి వారు యువతకు ఆదర్శమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ హరీష్ కుమార్, సాయన్న, మోహన్, రాము, అశోక్, బాలరాజు, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ'సమ్మేళనాలు.. ఆత్మీయ పలకరింపులు


అంకాపూర్‌లో గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆర్మూర్ , అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-8 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులు వింజామర వెంకట్ నర్సయ్య, పసుపుల సుదర్శన్, దొండి శ్యామల, శారద, అతిక్‌లను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు నాటి తమ అనుభవాలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకట్, వీరేందర్, జ్ఞానేశ్వర్, ఆశీర్వాదం, కృష్ణయ్య, సతీష్, జలీల్, సర్ధాం, అశ్విని, రేణుక, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.


పెర్కిట్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆర్మూర్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని ఓ గార్డెన్‌లో ఆదివారం పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996-97 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నా రు.ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులు సురేందర్, ఓబన్న, చక్రధర్, మెగులయ్యను ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సునీల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్, హన్మాండ్లు, సాయికుమార్‌గౌడ్, వినోద, సుజాత, సురేఖ, రమాదేవి, లలిత పాల్గొన్నారు.



రావుట్లలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ప్రజా సమస్యలే ఎజెండాగా ఎన్నికల్లో పాల్గొందాం

● మాస్‌లైన్ నిజామాబాద్-కామారెడ్డి జిల్లాల కార్యదర్శి ప్రభాకర్

సిరికొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలే ఎజెండాగా ఎన్నికల్లో పాల్గొందామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నిజామాబాద్- కామారెడ్డి సంయుక్త జిల్లాల కార్యదర్శి వి.ప్రభాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిరికొండ మండలం రావుట్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్థానిక సంస్థల ఎన్నికలు- పార్టీ వైఖరి అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఎన్నికలు విప్లవ పార్టీలకు ఒక ఎత్తుగడ మాత్రమే అని అన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలే ఎజెండాగా మార్చుకొని ఎన్నికల్లో పాల్గొందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రజా సమస్యలను గుర్తుచేస్తూ ఎన్నికలను ఎత్తుగడగా ఉపయోగించుకోవాలన్నారు. సీపీఐ, సీపీఎం పార్టీలు భూర్జువ పార్టీలతో ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని దిగజారుడు రాజకీయాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. వారిని వీరిని రివిజనిస్టు పార్టీలుగా ప్రకటించి ఎంఎల్ పార్టీగా వేరుపడ్డామన్నారు. ఓట్లు, సీట్లు గీటురాయిగా రివిజనిస్టులు పనిచేస్తారని ఆయన కార్యకర్తలకు వివరించారు. విప్లవ పార్టీలుగా వాటిని భూర్జువ పార్టీలుగా తిరస్కరించాలని ప్రజలకు పిలుపునివ్వాలని ఆయన కోరారు. విప్లవ పార్టీలు పోటీలో ఉన్న చోట కలిసి అవగామానతో ముందుకు పోవాలని ప్రభాకర్ కార్యకర్తలను కోరారు.కాంగ్రెస్,బిజెపి,బీఆర్ఎస్ పార్టీలు డబ్బు సంచులు,మద్యం తో ఎన్నికల్లో తలపడుతాయని,ప్రజలు భూర్జువ పార్టీలను చిత్తు చేసి ప్రజల కోసం పనిచేసే సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రభాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రామకృష్ణ,జిల్లా నాయకులు దేవరాం, ముత్తెన్న రమేష్, సురేష్, సత్తెవ్వ, రాజేశ్వర్, కిషన్, దామోదర్ నారగౌడ్, ఈ రమేష్, నరేందర్, పద్మా, భూముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్షన్.. టెన్షన్..!



- అందరి దృష్టి 8వ తేదీపైనే
- కోర్టు తీర్పుపైనే ఎన్నికల భవితవ్యం
- రిజర్వేషన్లపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ
- ఊగిసలాటలో ఆశావహులు, నేతలు
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు
- ఎక్కడ చూసినా ఎన్నికల ముచ్చట్లే

ఎల్లారెడ్డి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు జీవోపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఏం తీర్పు ఇస్తుందోనని రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠగా మారింది. జీవో-9 అమలుకు అనుమతిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా ప్రకటన చేస్తుందా? లేక నిలిపివేస్తూ ప్రకటన వస్తుందా? అసలు అక్టోబరు 8న ఏం జరుగుతుందని ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ కొనసాగుతుంది.

ఎన్నికలు జరుగుతాయా..? వాయిదానా..?

బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో9ని జారీ చేసిన విషయం తెలిసిందే. ఒకవేళ ఈ జీవోపై స్టే ఇస్తే ప్రకటించిన ప్రకారం ఎన్నికలు జరుగుతాయా? లేక వాయిదా వేస్తారా? అనేది హాట్ టాపిక్‌గా మారింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేందుకు గత నెల 29వ తేదిన రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో 2001 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ప్రాదేశిక స్థానాలు, పంచాయితీలను కేటాయించగా, జీవో -9 ప్రకారం బీసీలకు 42 శాతం మేర పంచాయితీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను రిజర్వు చేశారు. జనరల్ స్థానాలతో పాటు మహిళలకు రిజర్వేషన్ చేసిన స్థానాలను ప్రకటిస్తూ గెజిట్ విడుదల చేశారు.

● తరువాత చూద్దామన్నా.. తప్పని ఖర్చులు

రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వచ్చిన ప్రాంతాల్లో ఆశావాహులు కొందరు ఎన్నికల బరిలో నిలిచేందుకు సన్నాహలు ప్రారంభించగా, మరికొందరు వేచి చూసే ధోరణితో ఉన్నారు. జీవోకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు వస్తే రిజర్వేషన్లు మారే అవకాశం ఉందని, తీర్పు వచ్చిన తర్వాతనే ముందుకు సాగే విషయం తేల్చుకుందామని పలువురు భావిస్తున్నారు. మందు, విందు కోసం బాగానే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆచితూచి వ్యవహరిస్తున్న వారు కూడా ఎంతో కొంత ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అక్టోబర్ 8 తర్వాత చూసుకుందాం అంటూ ఖర్చు నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసిన ఆశావాహులు ఖర్చు బారిన పడక తప్పని పరిస్థితులు ఎదురయ్యాయి.

● గతానికి భిన్నంగా..

గతంలో ముందుగా ఒక నోటిఫికేషన్ జారీ అయ్యేది. అయితే ఎంపీటీసీ ఎన్నికలు లేదా సర్పంచ్, వార్డు ఎన్నికల్లో ఏదో ఒకటి ముందు జరిగేవి. దీంతో ముందుగా వచ్చిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆ ఎన్నికల్లో నుంచి ఓట్లు సాధించి దరిదాపుల్లోకి వచ్చి ఓడిపోయిన వారు. మరోసారి వెంటనే వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే అవకాశం ఉండేది. కానీ ఈసారి సానుభూతికి అవకాశం లేకుండానే నేరుగా ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఆ వెంటనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫలితంగా ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు సానుభూతిని మూటగట్టుకునే ఛాన్స్ లేకుండా పోయింది. ఒకవేళ రెండింటికి పోటీ చేస్తే నెగిటివ్ ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. మొదటి ఎన్నికల్లో ఓడి.. రెండో ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఈసారి లేవు. గతంలో చాలామంది సర్పంచ్‌గా ఓడి, ఎంపీటీసీ ఎన్నికల్లో గెలిచారు. ఎంపీటీసీగా ఓడి, సర్పంచ్‌గా గెలిచారు. ఈసారి ఆ అవకాశం లేకుండా పోయింది ఏది ఏమైనా ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలు రసవత్తంగా సాగనున్నాయి.



నవోదయకు ఎంపికైన విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న నర్సయ్య

నవోదయకు సిరికొండ విద్యార్థి

సిరికొండ, అక్టోబరు 5 (ఆంధ్ర జ్యోతి): జవహర్ నవోదయ పాఠశాలకు సిరికొండ విద్యార్థి గొల్ల రిశ్వంత్ ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.నర్సయ్య తెలిపారు.2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరడానికి రిశ్వంత్ ఎంపిక కావడం ఆనందంగా ఉందని నర్సయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థికి జ్ఞాపికను అందజేశారు. ఈ ఏడాది జనవరిలో ప్రవేశ పరీక్షను నిర్వహించారని ఆయన తెలిపారు. నిజామాబాద్‌లో ఏర్పాటు చేసే పాఠశాలలో రిశ్వంత్ చేరుతారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు నవీన్, చామంతి పాల్గొన్నారు.



బీర్కూర్‌లో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవంలో మాట్లాడుతున్న సాయిలు

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

బీర్కూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ సంస్థ ఏర్పాటై వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా సంస్థ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అయితే బీర్కూర్ మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ బీర్కూర్ శాఖ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టాక్లేవార్ గంగాధర్ రావు, వక్తగా కామారెడ్డి జిల్లా సహకార్యవాహ శ్రీరెడ్డి సాయిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. 1925లో డాక్టర్ బలిరామ్ కేశవ హెగ్డేవార్ దేశ నిర్మాణం కోసం ఆర్ఎస్ఎస్ సంస్థను స్థాపించారని తెలిపారు. 1925 నుంచి 2025 వరకు వందేళ్లుగా ఆర్ఎస్ఎస్ ప్రస్థానం కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా పంచ పరివర్తన అనే అంశంపై వారు మాట్లాడారు. కుటుంబ బోధ, సామాజిక సమరత ,పర్యావరణం, స్వదేశీ, పౌర కర్తవ్యం అనే అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు, గ్రామ యువకులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి

మద్నూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయానికి కృషి చేయాలని మద్నూర్ మండల స్థానిక ఎన్నికల ఇంచార్జి మోటూరి శ్రీకాంత్ అన్నారు. స్థానిక ఎన్నికల సమావేశాన్ని మద్నూర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యకర్తల కృషి వల్లనే బీజేపీ అధికారంలోకి వస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జుక్కల్ మాజీ శాసన సభ్యురాలు కుమారి అరుణతార, మండల అధ్యక్షుడు తెప్పావర్ తుకారాం, నాయకులు కృష్ణ పటేల్, తులవార్ సంతోష్, డోంగ్లి మండల అధ్యక్షులు అరుణ్ పటేల్, మాజీ సింగిల్ విండో చైర్మన్ పండిత్ రావ్ పటేల్, శంకర్ పటేల్, ప్రవీణ్, హన్మండ్లు, జూబ్రె సుధాకర్, అజయ్ తమ్మేవార్, యాదవ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్థానిక ఎన్నికల ఇన్‌చార్జి



ద్విచక్ర వాహనం అందజేస్తున్న మండప నిర్వాహకులు

విజేతకు బైక్ అందజేత

బోధన్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని తట్టికోటలో గల శ్రీ మార్కండేయ దేవీ అమ్మవారి విగ్రహ 11వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహణ కమిటీ లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కీ డ్రాలో గెలుపొందిన కోటగిరి మండలానికి చెందిన మోతిరాం రవి కిరణ్‌కు పట్టణ సీఐ వెంకట నారాయణ చేతుల మీదుగా బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనాన్ని ఆదివారం అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో తనకు లక్కీ డ్రా వాహనం వచ్చిందని ఈ సందర్భంగా అమ్మవారి కమిటీ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినోద్, పవన్ కుమార్, కమిటీ నిర్వాహకులు తదితరులున్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

ఆర్య వైశ్యుల అభివృద్ధికి పాటుపడాలి

సుభాష్‌నగర్ అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా అందరూ కలిసికట్టుగా పని చేసి ఆర్యవైశ్యుల అభివృద్ధికి పాటుపడాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. జిల్లా కేంద్రంలోని కిసాన్ గంజ్‌లో ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దసరా పండగ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త మాట్లాడుతూ నేటి తరం ఆర్య వైశ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్క దేవేందర్ గుప్తాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పార్టీల కతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ముందుండి సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్క దేవేందర్ గుప్తా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ధన్‌పాల్ శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

బాసరలో పెరిగిన కుక్కల బెడద

● అధికారుల నిర్లక్ష్యంపై భక్తులు, స్థానికుల ఆగ్రహం



బాసర అమ్మవారి ఆలయం సమీపంలో వీధి కుక్కల స్వైర విహారం



గాయపడిన బాలుడు

బాసర, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాసర పుణ్యక్షేత్రంలో పిచ్చి కుక్కల స్వైర విహారం స్థానికులు, బక్తులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. అధికాయుల సమస్యను పట్టించుకోక పోవడంతో రోజురోజుకు ఈ దాడులు పెరుగుతున్నాయి. తాజాగా ఆదివారం బాసరకు చెందిన అల్లి అబ్దుల్లా అనే బాలుడిపై ఓ వీధి కుక్క దాడి చేసి తీవ్రగాయాలు చేసింది. అదృష్టవశాత్తు, స్థానికులు వెంటనే స్పందించిడంతో బాలుడికి ప్రమాదం తప్పింది. వెంటనే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. స్థానికంగా కుక్కల బెడద అధికమవడంతో కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చికెన్, మటన్ దుకాణాల పరిసరాల్లో కుక్కల సంచారం ఎక్కువగా ఉంటోందని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయపడుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు.

● **అమ్మవారి భక్తులకు తప్పని కష్టాలు..**

సరస్వతి అమ్మవారి ఆలయం పరిసరాల్లోనూ పిచ్చి కుక్కల బెడద ఎక్కువయింది. ఆలయానికి వచ్చే యాత్రికులపై కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచిన ఘటనలున్నాయి. గుంపులుగా తిరిగే ఈ కుక్కలను చూసి భక్తులు, ముఖ్యంగా తెల్లవారుజామున పూజలను వచ్చేవారు, తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. స్థానికులు, భక్తులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు పెరిగి పోతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికయిన సంబంధిత అధికారులు స్పందించి, తక్షణమే ఈ పిచ్చికుక్కల సమస్యను పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని బాసర గ్రామస్థులు, యాత్రికులు కోరుకుంటున్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు



ఇజ్రాయిల్‌లో బతుకమ్మ సంబురాలకు హాజరైన జిల్లా వాసులు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామ ప్రధాన వీదుల గుండా బతుకమ్మను ఊరేగించి స్థానిక బతుకమ్మ కుంటలో నిమజ్జనం చేశారు. ఎస్సై అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పెర్కిట్‌లో..

ఆర్మూర్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో బతుకమ్మ సంబు రాలు శనివారం రాత్రి వరకు కొనసాగాయి. విశాఖ కాలనీలో మహిళలు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ టవర్స్ అధ్యక్ష కార్యదర్శులు మోతే రామాగౌడ్, జగన్ పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌లో..

ఆర్మూర్: ఇజ్రాయిల్‌లో ఆదివారం జిల్లావాసులు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఇజ్రాయిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు పాటలు పాడుతూ బతుకమ్మ ఆడుతూ బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు.

కార్యకర్తలకు దిశానిర్దేశం

మోస్రా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మోస్రా మండల కేంద్రంలో బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పని చేయాలని, అన్ని విధాలుగా సహకరించేందు తాము సహకరిస్తామని నాయకులు పేర్కొన్నారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తారని తెలిపారు. నాయకులు తమ అభ్యర్థిని గుర్తించి ఎన్నుకొని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ నాయకులు జుబేర్ మండల నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

సిరికొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐడీసీఎంఎస్ పర్యవేక్షకుడు అనీస్ ఆదివారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాను సారంగా మూషీర్‌నగర్, రామడుగు, కొండూర్ గ్రామాల్లో ఐడీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిని పర్యవేక్షకులు అనీస్ స్థానిక రైతులు, నాయకులు సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు సంతోష్ నాయక్, కుందేళ్ల శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఫొటో న్యూస్



సాటాపూర్ రైల్వే గేట్ మార్గంలో లారీలో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న దృశ్యం



పొలం కోత పనుల్లో అధికంగా హార్వెస్టర్లను వినియోగిస్తున్న దృశ్యం







వరి కోతలు ప్రారంభం

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. వర్షాలు ఎప్పుడు పడతాయో తెలియక రైతులు హార్వెస్టర్లను ఆశ్రయిస్తున్నారు. ఎడపల్లి మండలం సాటాపూర్ రైల్వే గేట్ మార్గంలో ఆదివారం ఒకే పొలంలో ఐదుకు పైగా హార్వెస్టర్లు వరి కోతల్లో నిమగ్నమయ్యాయి. కోసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు

● (ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్)


జోగేంద్రనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

జోగేంద్రనాథ్ మండల్ వర్ధంతి

వేల్పూర్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జోగేంద్రనాథ్ మండల్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జోగేంద్రనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ రాజ్యాంగ సభకు పంపిన మహనీయులు జోగేంద్రనాథ్ మండల్ అని పేర్కొన్నారు. 1946లో రాజ్యాంగ సభ ఎన్నికలలో బెంగాల్ నుంచి వచ్చిన నాయకుడు జోగేంద్రనాథ్ మండల్ అంబేద్కర్‌ను రాజ్యాంగ సభకు పంపిస్తామని అంబేద్కర్‌ను గెలిపించాడని పేర్కొన్నారు. అప్పుడు అంబేద్కర్‌ను కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఓడించడానికి ప్రయత్నించారని తెలిపార. కార్యక్రమంలో ఏవైఎస్ ప్రధాన కార్యదర్శి జాంబవ చామర్, కార్యవర్గ సభ్యులు బాబురావ్, శ్రీనివాస్, విశ్వనాథ్, ఏవైఎస్ సభ్యులు పాల్గొన్నారు.

నృత్య కళాకారిణికి సన్మానం


శ్రీవల్లిని సన్మానిస్తున్న సభ్యులు

వేల్పూర్,అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి):ఇటీవలే మలేషియాలో జరిగిన దసరా ఉత్సవాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలో వేల్పూర్‌కు చెందిన కోమన్‌పల్లి జైపాల్ కూతురు శ్రీవల్లిని ప్రతిభ కనబర్చింది. దీంతో వేల్పూర్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో శ్రీవల్లిని సన్మానించారు. శ్రీవల్లిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు.

భూపతిరెడ్డికి సుదర్శన్‌రెడ్డి పరామర్శ


రూరల్ ఎమ్మెల్యే తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుదర్శన్‌రెడ్డి

సుభాష్‌నగర్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని ఆదివారం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. జిల్లాకేంద్రంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తల్లి లక్ష్మీ నర్సవ్వ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటీవల రూరల్ ఎమ్మెల్యే తల్లి లక్ష్మీనర్సవ్వ అనారోగ్యంతో మృతి చెందడంతో తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆకాంక్షించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడే మానాల మోహన్ రెడ్డి, ఎన్‌డీసీసీబీ అధ్యక్షుడు కుంట రమేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న మార్వాడి యువమంచ్ నాయకులు

యువమంచ్ ఆధ్వర్యంలో వాక్‌థాన్

సుభాష్‌నగర్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి):ఆలిండియా మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో ఆదివారం వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్ నుంచి హరిచరణ్ మార్వాడీ స్కూల్ వరకు వాక్‌థాన్ కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్వాడి యువమంచ్ అధ్యక్షులు దామోదర్ దాస్ మలాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్‌ను రోజంతా పనిలో ఉంచడానికి ప్రతి రోజు అరగంట చార్జ్ చేయడం అవసరమని, మన శరీరాలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ప్రతిరోజు కనీసం అరగంట పాటు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్వాడి మంచ్ నాయకులు సందీప్ సర్దా, ఉపాధ్యక్షులు డాక్టర్ అంకిత్ అగర్వాల్, డిప్యూటీ సెక్రెటరి రమేష్ పాండే, కోశాధికారి సందీప్, ఆర్గనైజింగ్ సెక్రెటరి కృష్ణ ఉపాధ్యాయ్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఆనంద్, చార్టర్డ్ అకౌంట్ మోహిద్, పవన్ ముండాడా తదితరులు పాల్గొన్నారు.


సంఘం కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న ప్రతినిధులు

వైష్ణవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకేంద్రంలోని చక్రంగుడిలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షుడిగా సేనాపతి వేణుగోపాలచార్య, ప్రధాన కార్యదర్శిగా సముద్రాల శ్రీధరచార్య, ఉపాధ్యక్షులుగా కలకుంట్ల నర్సింహమూర్తి, తులసీ మురళీధరచార్య ఎన్నికయ్యారు. సహాయకార్యదర్శిగా మాకునూరి శ్రీధర్, శ్రీభాష్యం కృష్ణమాచార్య, కోశాధికారిగా కలకుంట్ల శ్రీధరచార్య ఎన్నుకోబడ్డారు. కార్యవర్గ సభ్యులుగా సందుగుల శ్రీనివాసచార్య, గోవర్ధన్ సందీప్‌కుమార్, కందాలై విజయ్‌కుమార్, గోవిందుల చంద్రమోహన్, సముద్రాల మధుసూదన చార్యులను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సారంగపాణి శ్యాంసుందర చార్య, కందాలై నాగరాజ్, సేనాపతి సంపత్‌కుమారచార్య, కందాలై వినయ్‌కుమార చార్య, సేనాపతి నర్సింహాచార్య తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి పీఎస్‌ను తనిఖీ చేసిన సీపీ

(3వ పేజీ తరువాయి)

ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్ జిల్లా సరిహద్దులో ఉన్నందున అక్కడి నుంచి ఇక్కడికి వచ్చి వేళ్లేవారిపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సులభంగా డబ్బులు సంపాదించేలనే అత్యాశతో యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ సైబర్ మోసగాళ్ల చేతులో పడి డబ్బులు కోల్పోతున్నారని చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి గేమింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు


కోటగిరిలో ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

కోటగిరి,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు రాజు మహరాజ్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్ ఏర్పాటు చేసి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. హిందు సమాజాన్ని జాగృతం చేయడంలో ఆర్‌ఎస్‌ఎస్ ముందుందన్నారు. విజయదశమి రోజున నిజామాబాద్ జిల్లాలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు సేవ చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, సిద్దు, లక్ష్మణ్, నవీన్, సాయిబాబా గౌడ్ తదితరులు ఉన్నారు.


మోస్రాలో మాట్లాడుతున్న వక్త

హిందువులందరూ కలిసి రావాలి

మోస్రా,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మోస్రా ఖండ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పంచ పరివార్తన గురించి ఆర్ఎస్ఎస్ విభాగ్ కుటుంబ ప్రబోదక్ ఎండల శ్రీనివాస్ వివరించారు. ఐదు రకాల మార్పులు చేయాలనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. హిందువులందరు కలిసి కట్టుగా రావాలని కోరారు. విజయ భాస్కర్, గంగారాజు, ప్రీతం, సాయిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆర్‌ఎస్‌ఎస్ మోర్తాడ్ శాఖ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు జీ.ప్రదీప్, ఎస్.దినేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెడెవార్ భరతమాత, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల చిత్రపటాలకు పూలమా లలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

దేశం, ధర్మం కోసం కృషి చేయాలి

ఎడపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఠాణాకలాన్‌లో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమం నుంచి పిట్ల కృష్ణమహరాజ్ హాజరయ్యారు. ఆర్‌ఎస్ఎస్ దేశంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టిందని, ఇది అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు మన ధర్మం, దేశం కోసం మనవంతు కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా ప్రచారక్ దస్తగిరి మాట్లాడుతూ.. రాష్ట్రీయ స్వయం సేవక్ 70 దేశాలు, 50 వేలల్లో శాఖలు, ఎన్నో రకాల అంశాలలో ఇమిడి ఉందని, దేశంలో ఎన్నో పార్టీలు పుట్టి అంతరించి పోయాయని, సంఘ్ ఎందుకోసం ఏర్పడిందో అదే కార్యచరణతో నేటికి నడుస్తుందన్నారు. ప్రతి హిందువు దైవ భక్తిని అలవర్చుకోవాలని పేర్కొన్నారు.


ఎడపల్లిలో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్న పిట్ల కృష్ణ మహరాజ్

ప్రతీఒక్కరు దేశభక్తిని కలిగి ఉండాలి

నవీపేట,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు దేశభక్తిని కలిగి ఉండడంతో పాటు దేశ రక్షణకు కంకణబద్దులై ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ సహ ప్రాంత ప్రచారక్ కల్వగురి ప్రభు కుమార్‌జీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల ఆవరణలో జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు దేశ చరిత్ర, పురాణాలు, ఇతియాసాలను మరిచిపోవద్దని ఆయన పేర్కొన్నారు. దేశభక్తి, సమాజ పరివర్తనలో ఆర్‌ఎస్‌ఎస్ ముందు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ మఠంకర్ సుధాకర్ రావు, ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ సహ ప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్

ప్రజలను చైతన్య పరిచేందుకే పోలీసు కళాబృందాలు

సుభాష్ నగర్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి) ప్రజలను చైతన్యపరిచేందుకు పోలీస్ కళాబృందాలు తోడ్పాటునిస్తున్నాయని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కళాబృందాలు మాదకద్రవ్యాల వైపు యువతను మొగ్గుచూపకుండా అవగాహన కల్పిస్తున్నాయన్నారు. మార్చి నుంచి సెప్టెంబర్ వరకు 117 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గ్రామాలకు పోలీస్ కళాబృందం వెళ్లి ప్రజలను చైతన్యం చేస్తున్నాయని వెల్లడించారు. పోలీస్ సిబ్బంది ఒక కళాబృందంగా ఏర్పడి ప్రతి పల్లెలో సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం మహిళల రక్షణ మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తుందన్నారు. మూఢ నమ్మకాలు ప్రజల మనసుల్లో ఇంకా ఉండడాన్ని దృష్టిలో పెట్టుకొనికళాబృందం పాటలు నాటక రూపంలో ప్రజలను అలరిస్తూనే మోసాలను వివరిస్తున్నాయని చెప్పారు. ప్రజల జీవితాలలో వెలుగులు నింపడానికి స్వచ్ఛందంగా కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రధానంగా పోలీస్ కళాబృందం కల్తీకల్లు, రోడ్డు భద్రత, మహిళల రక్షణ గురించి వివరిస్తుందదన్నారు. మహిళలు అసౌకర్యానికి గురైనప్పుడు షీ టీం నెంబర్ 87126 59795, అత్యవసర పరిస్థితుల్లో 100కు కాల్ చేయాలని సూచించారు. ఆన్లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, మోసానికి గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలన్నారు. ఈ కళాబృందానికి ఆర్ఐ శ్రీనివాస్ ఇన్చార్జిగా ఉన్నారని ఏఆర్ ఎస్సై శ్రీనివాస్ కానిస్టేబుల్ శేఖర్ విక్రమ్ మహిళా హోంగార్డు సీత ఔట్సోర్సింగ్ ఉద్యోగులు బాలరాజ్ బాధ్యులుగా ఉన్నారన్నారు. కళాబృందం ద్వారా మంచి స్పందన వస్తుందని ప్రజలు చైతన్యవంతులుగా మారుతున్నారని పేర్కొన్నారు.


పోలీస్ కమిషనర్ సాయి చైతన్య


సారంగపూర్ ప్రధాన రహదారి దుస్థితి

ఇదేం రోడ్డు సార్...!

మోపాల్,అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్-బోధన్ ప్రధాన రోడ్డు సారంగపూర్ వద్ద భయంకరంగా తయారైంది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు గుండానే బాసర దర్శనానికి అనేక మంది వెళ్తుంటారు. అధికారులు, నాయకులు ఇలాగే వస్తూ పోతుంటారు. కానీ పట్టించుకునేవారే కరువయ్యారని వాహనదారులు మండిపడుతున్నారు. భారీ గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రాత్రివేళల్లో మరింత ఇబ్బందికరంగా ఉంటుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

చెట్టు కాదు.. కరెంటు స్తంభం



మోపాల్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు పిచ్చిమొక్కలు మొలిచిన పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్తంభాలు రోడ్డు పక్కనే ఉన్నా అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు మండిపడుతున్నారు. నిజామాబాద్ రూరల్ మండలం గుండారం నుంచి పాల్దా, జన్నేపల్లి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కనే ఓ స్తంభాన్ని పిచ్చిమొక్కలు ఆవరించి చెట్టులా దర్శనమిస్తోంది. దీని సమీపంలోనే రైస్‌మిల్లులున్నాయి. ఈ మార్గంలో ప్రజాప్రతినిధులు, అధికారులు వస్తూపోతుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్తంభాన్ని ఆవరించిన పిచ్చిమొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సమీక్షలో జిల్లా నాయకులు

సుభాష్‌నగర్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్ నియోజకవర్గానికి త్వరలో జరగనున్న ఉప ఎన్నిక నేపథ్యంలో ఆదివారం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలో జిల్లాకు చెందిన నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నూడా చైర్మన్ కేశవేణు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరగనున్న ఉపఎన్నిక నేపథ్యంలో పలువురు కార్పొరేషన్ చైర్మన్‌లకు, ముఖ్యనేతలకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. ఉపఎన్నికలో పార్టీని గెలిపించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది.


సమీక్షలో పాల్గొన్న కేశవేణు, ఇతర నాయకులు

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

● ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య

నిజామాబాద్‌కల్చరల్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న, సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలో గల ఎన్ఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల జొన్న పంట నష్టపోయి దిగుబడులు తగ్గాయని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తే రైతులను ఆదుకున్నవారవుతారని అన్నారు. జిల్లాలో 52వేల ఎకరాల్లో మొక్కజొన్న వేసారని, వచ్చిన పంట కాస్తా రైతులు అమ్ముకుందామనుకుంటే కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. మార్క్‌ఫెడ్ సహకార సంస్థ ద్వారా మద్దతు ధర క్వింటాకు రూ.2400లకు కొనాల్సి ఉండగా 1800 నుంచి రూ.2వేల రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని నష్టపోతున్నారని అన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు సాయిలు, నాయకులు గోపాల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర తిరుపతి క్షేత్రంలో గోపూజ

నిజామాబాద్‌కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గంగస్థాన్ ఫేస్-2లో గల ఉత్తర తిరుపతి క్షేత్రంలో ఆదివారం ఇందూరు గోసేవా సమితి ఆధ్వర్యంలో గో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గల గోశాలలో ఆవులకు స్నానం చేయించి నూతన వస్త్రాలతో అలంకరించారు. ఆవులకు పచ్చిగడ్డి, బెల్లం, దాన వంటివి అందించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు వీరమల్లు రమేష్ మాట్లాడుతూ గోవులను సేవ చేయడం వల్ల సకల దేవతలను పూజించిన పుణ్యం లభిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరు గోవులను కాపాడే విధంగా చూసి హిందూ సాంప్రదాయంలో గోవుల విశిష్ఠతను ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన పార్టీలకు అభ్యర్థుల కొరత

(3వ పేజీ తరువాయి)

ఆధారంగా టికెట్లు ఇస్తామని చెబుతున్న ప్రధానపార్టీల నేతలు అసలు సర్పంచేసేందుకు అభ్యర్థులే లేకపోవడంతో వింత పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల సీనియర్ నాయకులు తమ బంధువులను, తమ కుటుంబ సభ్యులను బరిలో దింపే ప్రయత్నాలు చేస్తున్న వారికి ప్రజల్లో ఎలాంటి ఆదరణ లేకపోవడంతో వారు ఎన్నికల్లో గెలుస్తారో గెలవరోనన్న సందేహాలు నెలకొంటున్నాయి. దీంతో పార్టీ ముఖ్య నేతలు వారికి టికెట్లు ఇచ్చేందుకు ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

నేతలకు తలనొప్పిగా అభ్యర్థుల ఎంపిక

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రధాన పార్టీలకు తలనొప్పి వ్యవహారంగా మారాయి. అధికార కాంగ్రెస్‌పార్టీ ఎలాగైనా జిల్లా పరిషత్ చైర్మన్ పదవితో పాటు మెజారిటీ ఎంపీపి స్థానాలను గెలుచుకోవాలనే ఉద్దేశంతో ఉండగా కొన్ని మండలాల్లో ఆ పార్టీకి సైతం బలమైన అభ్యర్థులు లేకపోవడం గెలుపు అవకాశాలను దెబ్బతీసే అవకాశం ఉంది. కొన్ని మండలాలలో జడ్పీటీసీ రిజర్వేషన్లు అనుకూలంగా రాకపోవడంతో ఆ పార్టీకి అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొంది. ఆదివారం సాయంత్రం నాటికి పీసీసీకి ప్రతీ మండలం నుంచి ముగ్గురు ఆశావహుల జాబితాను జిల్లా కాంగ్రెస్ కమిటీ అందజేయాల్సి ఉండగా ఇంకా ఆశావహుల జాబితా ఖరారు కాలేదు. ఈనెల 8న అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పినా జిల్లాలో ఇంకా ఆశావహుల జాబితా సిద్ధం కాకపోవడంతో ఆ ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉంది. జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ స్థానాన్ని ఇటీవల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుచుకున్న బీజేపీ సైతం ఈసారి జిల్లా పరిషత్‌ను కైవసం చేసుకునేందుకు కసరత్తు చేస్తోంది. కానీ ఆ పార్టీకి కూడా కొన్ని మండలాలలో అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ పరిస్థితి జిల్లాలో దారుణంగా ఉంది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గత జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాన్ని గెలుచుకుంది కానీ అధికారం కోల్పోవడంతో ఆ పార్టీ నుంచి చాలామంది నేతలు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పుడు ఆ పార్టీకి మండల స్థాయిలో అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ప్రధాన పార్టీలకు రిజర్వేషన్లు అనుకూలంగా రాని మండలాలలో అభ్యర్థులు దొరకని వింత పరిస్థితి నెలకొంది.

అన్నదాతకు వరి'గోస'

(3వ పేజీ తరువాయి)

చెప్తున్నా రైతులు యూరియా కోరం అష్టకష్టాలు పడ్డారు.

మాయదారి రోగం

పంట పొట్ట దశకు వచ్చి ధాన్యం బయటకు వస్తున్న తరుణంలో పొలాలకు మోగి పురుగు ద్వారా ఉష తిరుగుడు రోగం వ్యాపించడంతో వరి ధాన్యం దెబ్బతింటోంది. దీంతో రైతులకు మరోభారం తప్పడం లేదు. అలా దెబ్బతింటున్న పంట పొలాలకు ఎకరానికి రూ.2వేలు ఖర్చు చేసి మందులు పిచికారీ చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఇదంతా చేసినా అకాల వర్షాలతో పంట చేతికొస్తుందో లేదోనని రైతులలో దిగులు మొదలైంది. పంట కోసిన తర్వాత కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కల్లాల వద్ద ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాయడం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పొలాల్లో ఇసుక మేటలతో నష్టపోయాం



● నితిష్, గోన్‌గొప్పుల, రైతు

సాగు మొదలు నుంచీ సమస్యలే. మొదట వర్షాల్లేక.. తర్వాత భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయాం. భారీ వర్షాలతో పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. ఎంతో కష్టపడి సాగు చేసిన పొలం దెబ్బతినడంతో పంట పూర్తిగా నష్టపోయాను. ఇసుక కుప్పలను తీసి వేసి పొలం చదును చేసుకోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని.

ఇసుకాసురుల నయా దందా

(3వ పేజీ తరువాయి)

పండ్లు తరలించే విధంగా ఇసుకను ట్రాలీలో నింపి వాటిపై ప్లాస్టిక్ కవరును కప్పి వరుస పెట్టి జోరుగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఈ వాహనాలు ప్రధాన రహదారుల్లో కాకుండా గల్లీ సందులలో సైతం వెళ్లేందుకు అనుకూలంగా ఉండడంతో ఒక్కో వ్యాపారి రెండు అంకెల్లో ట్రాలీ ఆటోలను కొనుగోలు చేసి యధేచ్చగా వ్యాపారం కొనసాగిస్తూ కాసులు గడిస్తున్నారు

మండలంలో అక్రమ ఇసుక డంపులు

మంజీరా పరివాహక ప్రాంతంలో నిలువ ఉంచిన ఇసుకను మినీ ఆటోలలో తెచ్చి మండలంలో ఇసుక వ్యాపారం చేసే ఇసుక బకాసురుల డంపింగ్ స్థానాల్లో డంపింగ్ చేస్తూ గుట్టు చప్పుడు కాకుండా వెళ్లిపోతున్నారు. దీంతో మండలంలోని ఇసుక బకాసురులు తమ ట్రాక్టర్‌లలో ఆ ఇసుకను నింపి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల అవసరాన్ని గుర్తించి అధిక ధరలకు అమ్మడంతో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇసుక అందని ద్రాక్షలా తయారయింది.

పట్టించుకోని అధికారులు

గత కొన్ని నెలలుగా అక్రమంగా అడ్డదారుల్లో ఇసుక వ్యాపారం ఈ ట్రాలీ ఆటోలలో కొనసాగుతున్న విషయం తెలిసినా పోలీసు, రవాణా, రెవెన్యూ సంబంధిత శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అవి వస్తున్నారూట్లలో కనీసం తనిఖీలు చేపట్టడం లేదు. నెలలో ఏదో ఒకసారి రెండు ఆటోలను పట్టుకుని అక్రమ ఇసుక వ్యాపారాన్ని అడ్డుకట్ట వేశామనే గొప్పలు చెప్పుకుంటున్నారు. దీంతో ఈఅక్రమ ఇసుకట్రాలీ వ్యాపారం జోరుగా సాగుతూనే ఉంది. ఇప్పటికైనా ఈఆటోట్రాలీ ఇసుక రవాణా వ్యాపారాన్ని సంబందింత శాఖల అధికారులు ఎలా అడ్డుకుంటారో వేచి చూడాల్సిందే.

బీజేపీలోకి కాంగ్రెస్ నేతలు

సిరికొండ, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిమడుగుకు చెందిన కాంగ్రెస్ నాయకులు కొంకటి రమేష్ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు బాబురావు, మాలవత్ మహేందర్, తదితరులున్నారు.

సినిమా గైడ్

దేవి : ఇడ్లీ కొట్టు (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కాంతారా చాప్టర్-1 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కాంతారా చాప్టర్-1 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : ఓజి (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : ఓజి (తెలుగు) (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : కాంతారా చాప్టర్-1 (11.00)
: ఇడ్లీ కొట్టు (1.50, 4.35, 10.35)
స్క్రీన్-3 : కాంతారా చాప్టర్-1 (1.30, 4.30, 7.30, 10.25)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : కాంతారా చాప్టర్-1 (9.00, 12.25, 3.50, 7.15, 10.40)
స్క్రీన్-2 : ఓజి (తెలుగు) (10.10, 1.20, 4.30, 7.40, 10.50)
స్క్రీన్-3 : కాంతారా చాప్టర్-1 (10.10, 7.35)
: సన్నీ సంస్కారికి తులసీకుమారి (హిందీ) (1.35, 11.00)
: ఇడ్లీ కొట్టు (4.30)
స్క్రీన్-4 : సన్నీ సంస్కారికి తులసీకుమారి (హిందీ) (10.05, 7.50)
: కాంతారా చాప్టర్-1 (1.00)
: మిరాయి (4.25)
: ఇడ్లీ కొట్టు (10.45)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,22,500	రూ.1,14,200	రూ.1550

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.265	రూ. 285

